

అయోధ్యలో రామమందిరం సంతోషదాయకం

● ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామమందిర నిర్మాణం సంతోషదాయకమని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. తాము అయోధ్య రామ మందిర నిర్మాణానికి వ్యతిరేకం కాదని తెలిపారు. బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తాము మతం ముసుగులో రాజకీయాలను వ్యతిరేకిస్తామని తెలిపారు. అయోధ్య రామమందిర ప్రారంభానికి తనకు ఎటువంటి ఆహ్వానం రాలేదన్నారు. ఆహ్వానం వస్తే వెళ్లే విషయం పరిశీలిస్తామని అన్నారు. సీఎం సిద్దరామయ్య తరచూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పట్ల వ్యతిరేకంగా వ్యాఖ్యానిస్తారు. ఇటీవలే హిందూ వేరు హిందూత్వ వేరు అంటూ సంచలన ప్రకటన చేశారు. తాజాగా రాష్ట్రప్రభుత్వం గతంలో రద్దు చేసిన హిజాబ్‌ను పునరుద్ధరించే విషయమై చర్చిస్తామన్నారు. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసే సీఎం రామమందిరం సంతోషమని ప్రకటిండం సర్వత్రా చర్చనీయాంశమయింది.

భారీ స్థాయిలో ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు

● 80 మందికి పైగా స్థాన చలనం

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదికి ఒకరోజు ముందు ప్రభుత్వం భారీ స్థాయిలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీ చేసింది. 46 మంది ఐఏఎస్‌లు, 37 మంది ఐపీఎస్‌లకు స్థాన చలనం కలిగింది. ఐపీఎస్‌లలో సీనియర్ అధికారి కమల్‌పంత్‌ను డీజీపీ రిక్రూట్‌మెంట్ విభాగానికి బదిలీ చేసింది. అలోక్‌కుమార్‌ను రోడ్‌సేఫ్టీ స్పెషల్ కమిషనర్‌గాను, సీమంత్‌కుమార్‌ను బెంగళూరు మెట్రో పాలిటన్ టాస్క్‌ఫోర్స్ ఏడీజీపీగాను, హరిశేఖరన్‌ను ఏడీజీపీ హోంగార్డ్స్ అండ్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్‌గాను, నంజుండస్వామిని ఏడీజీ అగ్నిమాపక, అత్యవసర విభాగానికి, చంద్రగుప్తను ఐజీపీ బెంగళూరు ఏసీపీ క్రైం విభాగానికి, డాక్టర్ కె. త్యాగరాజన్‌ను దావణగెరె రేంజ్ ఐజీగాను, అమిత్‌సింగ్‌ను మంగళూరు రేంజ్ ఐజీగాను, డాక్టర్ వైఎస్ రవికుమార్‌ను డీఐజీ పోలీస్ సెక్యూరిటీ విభాగానికి, శాంతనుసింహాను బదిలీ చేసింది. డీఐజీ పేస్కేల్స్ విభాగానికి, డాక్టర్ దివ్యాగోపినాథ్‌ను బెంగళూరు ఫోరెన్సిక్ విభాగం డీఐజీగాను, సుధీర్ కుమార్‌రెడ్డిని ఫారెస్ట్‌సెల్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ విభాగానికి డీఐజీగాను, ఆర్ చేతన్‌ను కలబురగి సిటీ పోలీస్ కమిషనర్‌గాను, వర్తిగా కటియార్‌ను ఇంటర్నల్ సెక్యూరిటీ డీఐజీగాను, కార్తీక్‌రెడ్డిని సెలెక్షన్ గ్రేడ్ ఎస్పీగాను, కుల్‌దీప్‌కుమార్‌జైన్, వినాయక్ వసంతరావ్, సంతోష్‌బాబు, ఇషాపంత్, సంగీత, సీమాలాడ్కర్, రేణుకా సుకుమార్‌లను సెలెక్షన్ గ్రేడ్ ఎస్పీలుగా ప్రకటించింది. సిరిగౌరిని బెంగళూరు నార్త్ ట్రాఫిక్ డీసీపీగాను, పుట్టమాదయ్యను సివిల్‌రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగాను, శ్రీధర్‌ను ఏజీపీ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. వీరితోపాటు మరింతమంది అధికారులను బదిలీ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఐఏఎస్‌లకు కూడా భారీ స్థాయిలో స్థానభ్రంశం చోటు చేసుకుంది. ఏకంగా 46 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అరవింద్ శ్రీవాత్సవ్‌ను పీఎంఓ అడిషనల్ సెక్రటరీగాను, అంజుమ్ పర్వేజ్‌కు పదోన్నతి కల్పించి బీఎంఆర్‌సీఎల్ ఎండీగా అదే స్థానంలో కొనసాగించారు. మంజునాథ్ ప్రసాద్‌ను అడిషనల్ చీఫ్ సెక్రటరీ కో-ఆపరేటివ్ విభాగానికి, శ్రీకర్‌ను



ఉన్నత విద్యావిభాగం ప్రిన్సిపల్ సెక్రటరీగాను, సుబోద్‌యాదవ్‌ను కేంద్రప్రభుత్వ అనుబంధమైన గంగా రిజర్వేషన్ విభాగానికి జాయింట్ సెక్రటరీగాను, దీప్తి ఆదిత్య ఖనాడేకు కేంద్ర ప్రభుత్వ విభాగానికి, రాజేంద్రచోళన్‌ను డీసీఎం సెక్రటరీగాను, ఉజ్వల్‌కుమార్ ఘోష్‌ను ఎండీ ఎస్ఎఫ్‌సీకి, దీపా ఎంను నగరాభివృద్ధిశాఖ ఎండీగాను, రమణ్‌దీప్ చౌదరి, ఖుష్బూ జీ చౌదరిలను పదోన్నతిపై ఉన్నతచదువులకు అవకాశం కల్పించారు. ఒకేరోజు ఐఏఎస్, ఐపీఎస్‌లు కలిపి 80మందికిపైగా అధికారులను బదిలీలు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

గవర్నర్, సీఎం నూతన సంవత్సర శుభాకాంక్షలు

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో వెల్లివిరియాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు కొత్త సంవత్సరంలో కొత్తదనం కలసి రావాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆకాంక్షించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ప్రధాని దేవెగౌడ, జేడీఎస్ నేత కుమారస్వామి, కేంద్రమంత్రులు ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె, రాజీవ్‌చంద్రశేఖర్, రాష్ట్రమంత్రులు పరమేశ్వర్, రామలింగారెడ్డి, కృష్ణబైరేగౌడ, దినేశ్‌గుండూరావు తదితరులు వేర్వేరుగా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటనలు విడుదల చేశారు.

బీఎంటీసీ ఉద్యోగులపై 6,960 కేసులు రద్దు

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో బీఎంటీసీ ఉద్యోగులకు ఊరట లభించింది. బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ) ప్రారంభమై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉద్యోగులపై ఉండే 6,960 కేసులను రద్దు చేశారు. ఉద్యోగుల్లో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందింపచేయాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎండీ సత్యవతి ప్రకటించా రు. నవంబరు 30వరకు సిబ్బందిపై ఉన్న కేసుల తీవ్రతను బట్టి రద్దు చేశామన్నారు. ఈ ప్రక్రియ ఒక్కసారికి మాత్రమే వర్తిస్తుందని, మరోసారి అటువంటి తప్పిదాలు చేస్తే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.


కొత్త సంవత్సరం సరికొత్త రాజకీయాలు



● ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలే ప్రధానం
● ఆప్ సహా చిన్నపార్టీలు పోటీకి వెనుకడుగు



బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం వచ్చేసింది. రాష్ట్రంలోనూ సరికొత్త రాజకీయాలు ఆరంభమయ్యా యి. ముగిసిన ఏడాదిలో ఎన్నెన్నో చారిత్రాత్మక ఘట్టా లు చోటు చేసుకున్నాయి. ప్రతిపక్షానికి పరిమితమైన కాంగ్రెస్ పార్టీ తిరుగులేని మెజారిటీ స్థానాలతో ప్ర భుత్వం ఏర్పాటు చేసింది. గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. అధిష్టానం పెద్దలు రాష్ట్రంపై పెట్టుకున్న ఆశలు ఫలించలేదు. ఇక జే డీ ఎస్ స్థానాలు సగానికి పడిపోయాయి. గతంలో 40 మంది ఎమ్మెల్యేలు కల్గిన పార్టీ 19సంఖ్యతో సరిపెట్టుకుంది. మరో నాలుగు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు వచ్చేస్తున్నాయి. అందుకు అనుగుణంగానే రాజకీయ వేడి ఆరంభమైంది. 15 ఏళ్ల తర్వాత మరోసారి బీ జేపీ, జేడీఎస్ మైత్రికి సిద్ధమయ్యాయి. గతంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఒకటి కాగా ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలతోపా టు భవిష్యత్తులోనూ ఐక్యంగా ముందుకెళ్లాలని తీర్మానించాయి. రాష్ట్రంలో తిరుగులేని నేతగా రాణిస్తున్న జేడీఎస్ నేత కుమారస్వామి వచ్చే ఎన్నికల ద్వారా ఢిల్లీవైపు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీ, జేడీఎస్‌లో అగ్రనేతలు ఒకే చోట ఉంటే వివాదాలు, విభేదాలు తలెత్తుతాయనే బీజేపీ అధిష్టానం వ్యూహం పన్నింది. ఇక శాసనసభ ఎన్నికల్లో గెలుపు ఉత్సాహంతో ఉండే కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలో ఎక్కువ స్థానాలు సాధించడం ద్వారా రాహుల్‌గాంధీ టార్గెట్‌ను సాధించడంతోపాటు ఇటీవలే ఐఎన్‌డీఐఏ కూటమిలో ప్రస్తావనకు వచ్చిన మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రి అంశానికి శక్తిని ఇవ్వదలిచారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి కాంగ్రెస్ తరపున డీకే సురేశ్ ఒక్కరే ఎంపీగా ఉన్నారు. రాష్ట్రంనుం చి ఎక్కువ స్థానా లు సాధించేందుకు వ్యూహంతో ఉన్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ ఇప్పటికే ఢిల్లీ పెద్దలతో అభ్యర్థుల జాబితాపై కసరత్తు చేశారు. మరో రెండు రోజుల్లో హస్తినకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో ప్రాంతీ య పార్టీలు ఉన్నా లోక్‌సభ ఎన్నికల్లో వారి ప్రభావం ఏమాత్రం ఉండదని చెప్పవచ్చు. ఢిల్లీ, పంజాబ్ తర్వాత కర్ణాటక మా లక్ష్యమని ఆప్ ప్రచారం చేసుకున్నా, శాసనసభ ఎన్నికల్లో కనీసం డిపాజిట్లు కూడా సాధించలేక పోయా రు. ఇక సీపీఎం, సీపీఐతోపాటు సినీ నటుడు ఉపేంద్ర పార్టీ సహా సుమారు పదికి పైగా రాజకీయ పార్టీలు పోటీ చేసే ఆలోచనలో లేరు. మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి బళ్లారి, కొప్పళ, రాయచూరు జి ల్లాలే లక్ష్యంగా రాజకీయాలు చేస్తున్నా ఇటీవలి ఎన్నికల్లో ఆయన ఒక్కరు మాత్రమే విజయం సాధించారు. లోక్‌సభకు వెళ్లే సా హసం చేయరని తెలుస్తోంది. దీన్నిబట్టి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ - జేడీఎస్ కూటమి, కాంగ్రెస్ పార్టీల మధ్యనే ఎన్నికలు జరగనున్నాయి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.14	1,625.36
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	635
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1709	8,830
సామర్థ్యం (టీఎంసీలు)	10.33	77.68

తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలి

● వేసవిలో ప్రత్నామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలి : అధికారులకు మంత్రి నాగేంద్ర ఆదేశం

బళ్లారి సిటీ,డిసెంబరు 31: రానున్న వేసవిలో జిల్లాలో తాగునీరు, పశువులకు మేత కొరత లేకుండా చూడాలని షెడ్యూల్డ్ తెగల సంక్షేమం, యువజన సాధికారత, క్రీడల శాఖ మంత్రి, బళ్లారి జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి నాగేంద్ర అధికారులను ఆదేశించారు. ఆదివారం నగరంలోని విజయనగర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) పరిపాలనా భవనంలో జరిగిన కరువు నిర్వహణపై జిల్లాటాస్క్ ఫోర్స్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లాలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రైవేట్‌గా బోరు బావులు, తాగునీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా బళ్లారి తాలూకాలోని హరగిండోని, హలకుంది గ్రామాల్లో తాగునీటి సరఫరా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో వేసవి కాలంలో పశువులకు పశుగ్రాసం కొరతను అధిగమించేందుకు బళ్లారి,సండూర్ వ్యాప్తిలో పశుగ్రాస బ్యాంకులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాపంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సంకనూర్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు. తహ్సీల్దార్ గురురాజ్, జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాగేంద్ర, డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

ఈశాన్య పట్టభద్రుల ఓటరు జాబితా విడుదల

బళ్లారి సిటీ, డిసెంబరు 31: ఈశాన్య కర్ణాటక పట్టభద్రుల ఓటరు జాబితాను సవరించి తుది ఓటరు జాబితాను ప్రచురించినట్లు సహాయ ఓటరు రిజిస్ట్రార్,జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు.

91-కంప్లి, 92-సిరుగుప్ప, 93-బళ్లారి రూరల్, 94-బళ్లారి నగర్, 95-సండూర్ తాలూకాలో 13,744మంది పురుషులు, 8,408 మంది మహిళలు , 4మంది ఇతరులు కలిపి జిల్లాలో మొత్తం 22,156 పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. తుది ఓటరు జాబితా ప్రచురణ తేదీ డిసెంబర్ 30 శనివారం ఎన్నికల సంఘం సూచించిన విధంగా,దర్ఖాస్తుదారులు డిసెంబర్ 01-11-2020 లోపు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం,స్థానిక నివాసి రికార్డు నుండి తమ డిగ్రీ వివరాలను సమర్పించడం ద్వారా ఓటర్ల జాబితాలో తమ పేరును పొందే అవకాశం ఉంది. అర్హులైన ఓటర్లు ఎన్నికల సంఘం నిర్దేశించిన దరఖాస్తులను ఫారం-18లో తేది 01-01-24 నుండి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ పత్రాల దాఖలు చివరి తేది వరకు సమర్పించవచ్చని డీసీ తెలియజేశారు.

హంపి విశ్వవిద్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేత

రూ.97 లక్షల బకాయిలు చెల్లించని వైనం



హంపి కన్నడ విశ్వవిద్యాలయం

కంప్లి, డిసెంబరు 31: రాష్ట్రంలో పేరుగాంచిన హంపి కన్నడ విశ్వవిద్యాలయానికి విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. సుమారు 97.80 లక్షలు విద్యుత్ బిల్లుల బకాయిలు వుండటంతో విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు జెస్కామ్ అధికారులు వెల్లడించారు. విశ్వవిద్యాలయానికి గల మూడు ట్రాన్స్‌ఫర్లకు కూడా సరఫరాను నిలిపివేసినట్లు తెలిపారు. గతంలో ఎన్నో సార్లు నోటీసులు ఇచ్చినా స్పందించక పోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు.

బీడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా చొక్క బసవన్నగౌడ్

సిరుగుప్ప, డిసెంబరు 31 : బీడీసీసీ బ్యాంకు నూతన డైరెక్టర్‌గా ఎన్నికైన చొక్క బసవన్న గౌడ్‌కు ఎమ్మెల్యే బీఎం నాగరాజు పూలమాలలతో ఆదివారం సన్మానించారు. సిరుగుప్ప తాలుకాలో గతంలో పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడిగా వున్న చొక్క బసవన్నగౌడ ఈ సారి బీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించడంతో ఎమ్మెల్యే బీఎం నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధ్యక్షులు కరిబసప్ప, సభ్యులు పూలమాలలతో సన్మానించారు.



నూతన డైరెక్టర్ చొక్క బసవన్నగౌడను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు



మహిళా సంఘాలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నీమరాజునాయక్

పథకాలను సద్వినియోగం చేసుకోండి

కంప్లి, డిసెంబరు 31 : గ్రామాల్లో స్త్రీశక్తి మహిళలు ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి కింద అందించే పథకాలను స్త్రీ శక్తి మహిళలు సద్వినియోగం చేసుకోవాలని హగరి బొమ్మనహళ్లి ఎమ్మెల్యే నీమరాజునాయక్ తెలిపారు. ఆదివారం పట్టణంలో ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వీరేంద్ర హెగ్డే ఆధ్వర్యంలో ప్రతి గ్రా మంలో ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి పథకం ద్వారా రుణాలు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గణేష్, ఒప్పత్తేశ్వర మఠాధీశ్వరులు నిరంజన్ ప్రభుదేవస్వాములు, మంజమ్మ జోగది, నితీష్ శెట్టి, హెచ్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సైలెన్సర్ల ధ్వంసం

కంప్లి, డిసెంబరు 31 : హోస్పేట పట్టణంలో ద్విచక్రవాహనాలకు వాహనాలకు వచ్చే సైలెన్సర్లను కాకుండా అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు ఉపయోగిస్తుండటంతో వాటిని ట్రాఫిక్ పోలీసులు గుర్తించి సుమారు 290 సైలెన్సర్లను రోడ్డురోలర్‌తో ధ్వంసం చేశారు. పట్టణంలో శబ్దతీవ్రత అధికంగా వుందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా పోలీసు శాఖ ఆదేశాలతో అధిక శబ్దం చేస్తున్న సైలెన్సర్ కలిగిన వాహనాలను పట్టుకుని వాటి సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఆదివారం రాత్రి కూడా ఎవరైనా సైలెన్సర్లు అధిక శబ్దం వచ్చేవి వాడితే ఆ వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద మహిళల బారులు



గ్యాస్ కేంద్రం వద్ద వేచి ఉన్న మహిళలు

సిరుగుప్ప, డిసెంబరు 31: ఉజ్వల గ్యాస్ సబ్సిడీ కోసం మహిళలు 4వ రోజు కూడా బారులు తీరారు. కేంద్ర ప్ర భుత్వం ఉజ్వల గ్యాస్ లబ్దిదారులకు సబ్సిడీ కల్పిస్తున్న నేపథ్యంలో తాలుకా వ్యాప్తంగా వున్న మహిళలు కేవైసీ నమోదు కోసం ఏజన్సీ వద్ద గుమిగూడారు. ఉజ్వల గ్యాస్ వున్న వారికి రూ.300 సబ్సిడీ వుంటుందని గ్యాస్ నిర్వాహకులు కృష్ణారావు తెలిపారు. ఈ కారణంగా ఎల్‌పీజీ గ్యాస్ వద్ద జనం భారీగా బారులు తీరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రాయచూరు, డిసెంబరు 31 : వేగంగా వెళుతున్న బులెరో వాహనం ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి దుర్మరణం పాలైయ్యారు. ఈ సంఘటన రాయచూరు తాలూకాలోని గిల్లేసుగూరు సమీపం హిరాపూర్ క్రాస్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మంత్రాలయం వైపు నుంచి వస్తున్న బులెరో వాహనం ముందువెళుతున్న ఆటోను ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగింది. ఆటోలో వెళుతున్న గిల్లేసుగూరు వాసి దొడ్డప్ప అక్కడికక్కడే మృతి చెందగా మరికొంతమందికి తీవ్రగాయాలైయ్యాయి. ఓతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించిన యరగేరా పోలీసులు సంఘటన స్థళాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

వివాదాల్లో మాల్ ఆఫ్ ఏసియా

● 15రోజుల మూసివేతకు పోలీస్ కమిషనర్ ఆదేశాలు ● కోర్టును ఆశ్రయించిన యాజమాన్యం

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్ట్ రోడ్డుకు అనుబంధంగా బ్యాటరాయనపురలో ఏర్పాటైన మాల్ ఆఫ్ ఏసియా తరచూ వివాదాల్లో చిక్కుకుంటోంది. క్రిస్మస్ వేళ సామాన్యుల ప్రవేశానికి 200 రూపాయలు టికెట్ విధించడం విమర్శలకు కారణమైంది. ఏకంగా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. మాల్ ఆఫ్ ఏసియాకు వచ్చే సందర్శకులు రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారని తద్వారా ట్రాఫిక్ జామ్ తీవ్రమవుతోందని ట్రాఫిక్ పోలీసులు నిర్ణయించారు. దీంతో 15రోజులపాటు మాల్ ఆఫ్ ఏసియాను మూసివేసేలా నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. మాల్ ఆఫ్ ఏసియాలో ఎంత విస్తీర్ణంలో షాపింగ్ కాంప్లెక్స్, సినిమా హాళ్లు ఉన్నాయి, ఎంతమందిప్రజలు అక్కడికి వెళ్లే వీలుంది, అందుకు తగిన పార్కింగ్ సదుపాయంపై పోలీసులు ఆరా తీశారు. నగరంలో ఏమాల్‌లో లేని విధంగా ద్విచక్రవాహనానికి రూ.100, కారుకు రూ.150 పార్కింగ్ చార్జ్ విధించడంతో ఎక్కువమంది రోడ్డుపైనే వాహనాలు నిలిపేస్తున్నారు. ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో పోలీసులు చర్యలు తీసుకున్నారు. అయితే ఫీనిక్స్‌మాల్ యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది. దీంతో ఒకరోజు మాత్రమే మూసివేసేలాంటి ఉత్తర్వును పొందారు. సోమవారం నుంచి మాల్ ఏ విధంగా కొనసాగుతుందనేది చర్చనీయాంశం అవుతోంది. పోలీసులు మాల్‌కు రక్షణ కల్పించాల్సిన అవసరం ఏర్పడింది.

బేకరీల వద్ద సందడే సందడి..



గుమిగూడిన ప్రజలు

రాయచూరు, డిసెంబర్ 31 : నూతన సంవత్సరం 2024 ప్రారంభమవుతున్న నేపథ్యంలో నగరంలో కొత్త సంవత్సరం సందడి నెలకొంది. ఆదివారం సాయంత్రం నగరంలోని ఏ బేకరి వద్ద చూసినా యువకులు-చిన్నారులు, వయోభేదం లేకుండా కేకులు కొనేందుకు బారులు తీరారు. కొత్త సంవత్సరం వేడుకను దృష్టిలో ఉంచుకుని బేకరి యజమానులు కొత్త సంవత్సరపు కేక్‌కు కొన్ని కూల్‌డ్రింక్స్ ఇతర పానియాలను ఆఫర్‌లుగా ఏర్పాటు చేశారు. వీటితో పాటు నగరంలోని పలు స్వీట్ దుకాణాల వద్ద పెద్ద సంఖ్యలో జనం గుమిగూడి స్వీట్‌లు కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు. నూనత సంవత్సరం వేడుకలు ఒకవైపు సాదాసీదాగా చేసుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా మద్యం ప్రీయులు మాత్రం బార్ షాపుల వద్ద మధ్యాహ్నం నుంచే పెద్దసంఖ్యలో కనిపించారు.

నామఫలకాల్లో కన్నడకు ప్రాధాన్యం ఇవ్వాలి

శిడ్లఘట్ట, డిసెంబరు 31: రాజధాని బెంగళూరు నగరంలో దుకాణాలు, హోటళ్లు, మాల్స్‌లలో నామఫలకాలలో కన్నడ భాషకంటే ఆంగ్ల భాషకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని ఖండిస్తూ నిరసన చేపట్టిన కన్నడ సంఘాల పోరాట నాయకులపై ఉంచిన కేసులను వాపసు తీసుకోవాలని బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బెంగళూరులో కన్నడ భాషకంటే ఆంగ్ల, హిందీ, తదితర భాషల ప్రభావం పెరిగిందన్నారు. ప్రత్యేకించి అంగళ్లు, హోటళ్లు, మాల్స్‌లలో కన్నడకంటే ఆంగ్లభాష రారాజిల్లుతోందని, దీన్ని ఖండిస్తూ కన్నడ సంఘాలు చేపట్టిన నాయకులపై కేసులు విధించడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. నామఫకలాలలో 60శాతం కన్నడభాష వినియోగించాలనే నిబంధన ఉన్నా చాలామంది ఉల్లంఘిస్తున్నారన్నారు. అటువంటి వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, బీబీఎంపీ పట్టించుకోలేదన్నారు. దీన్ని ఖండిస్తూ కన్నడసంఘాలు చేపట్టిన కార్యక్రమానికి ప్రశంసించి, మద్దతు ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రభుత్వ తీరు మాత్రం సమంజసంగా లేదన్నారు. కన్నడ పోరాటనేతలపై విధించిన కేసులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

సంక్రాంతి కానుకగా రూ.1,000

పుదుచ్చేరి, డిసెంబరు 31: పుదుచ్చేరిలో సంక్రాంతి కానుకగా రూ.1,000 అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంక్రాంతి సందర్భంగా ఎరుపు రంగు రేషన్‌కార్డుదారులకు రూ.1,000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. 4వ తేది ఈ నగదును 1,30,791 రేషన్ కార్డుదారులకు అందజేయనున్నట్లు పేర్కొంది.

అతిథి ఉపన్యాసకుల నిరసన

రాయచూరు, డిసెంబరు 31: తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని వేతనాలు పెంచాలని కోరుతు అతిథి ఉపన్యాసకులు చేపట్టిన పోరాటం అసంపూర్తిగా మిగిలే పరిస్థితి తలెత్తింది. గత 20 రోజులకు పైగా నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న అతిథి ఉపన్యాసకులను ఇప్పటికే చర్చలకు ఆహ్వానించిన ప్రభుత్వం వారితో జరిగిన చర్చలు విఫలం కావడంతో ప్రత్యమ్నాయ ఏర్పాట్ల పై దృష్టి సారించింది. ఈ క్రమంలో జనవరి 1వ తేదీన విధులకు హాజరుకాని వారి వివరాలు ఇవ్వాలంటు అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లాలో తమ డిమాండ్‌ల సాధన కోసం నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న అతిథి ఉపన్యాసకులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా ప్రభుత్వంతో జరిపిన చర్చ సందర్భంగా రూ.5 వేల వేతనం పెంపుతో పాటు జీవిత బీమా సౌకర్యం తదితర ఆఫర్‌లను ప్రభుత్వం ప్రకటించగా ఉపన్యాసకులు నిరాకరించినట్లు తెలిసింది.



ఆందోళన కొనసాగిస్తున్న అతిథి ఉపన్యాసకులు

నూతన పరిజ్ఞానంతో మోకాలి ఆపరేషన్లు

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బెల్‌నెస్ చాంపియన్స్ ఆసుపత్రిలో అధునాతన రోబోటిక్ పరిజ్ఞానంతో మోకాలి ఆపరేషన్లు విజయవంతం చేసినట్లు ఆర్థోపెడిక్ నిపుణుడు నటరాజ్ ప్రకటించారు. శనివారం నగరంలో ఆసుపత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. బెంగళూరులో కీళ్ళ సంరక్షణను అభివృద్ధి చేయడంలో కీలకమైన మైలురాయిని అధిగమించిందన్నారు. అత్యాధునిక క్లినిక్ సీఓఆర్‌ఐ సిస్టమ్‌గా పిలువబడే కృత్రిమ మేధస్సుతో రోబోటిక్ సాంకేతికతను అనుసంధానం చేస్తుందని ప్రకటించారు.

ఇటీవల కాలంలో మోకాళ్ళ నొప్పులు, ఇతరత్రా సమస్యలతో బాధపడేవారు పెరిగారని వారికి సాంకేతిక విధానంతో పాటు సున్నితంగా శస్త్రచికిత్సలు అమలు చేయడం సులభతరం చేశామన్నారు. అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి తీసుకురావడాన్ని సంతోషంగా భావిస్తున్నామన్నారు. బెల్‌నెస్ అనేది ఆరోగ్య సంరక్షణ సంస్థ కాగా వైద్య ప్రత్యేకతలు కలిగి ఉందన్నారు.

హోసూరు జోన్



నియామకపత్రాలతో నూతన పదాధికారులు

పీఎంకే పదాధికారుల నియామకం

హోసూరు (మత్తిగిరి)డిసెంబరు 31: పాటాళి మక్కళ్ పార్టీ (పీఎంకే) కి నూతన పదాధికారులను నియమించారు. హోసూరు అరసనట్టి ఏరియా జిల్లా కార్యదర్శి గోవిందరాజులు, జిల్లా మాజీ అధ్యక్షుడు మునిరాజ్ ఆధ్వర్యంలో సౌత్ నగర్ ఏరియాలో ఐదు వార్డుల శాఖలను ఏర్పాటు చేసి నూతన పదాదికారులకు పార్టీ నియామకపత్రాలు అందజేశారు. సిస్టర్స్ ఫోర్స్ సెక్రటరీ, లీడర్‌లతో సహ 50 స్థానాలకు నియమకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు భూపతి, మహిళా బృందం జిల్లా అధ్యక్షురాలు షర్మిళ, జనాభ లెక్కల జిల్లా కార్యదర్శి అరుళ్‌రాజ్, అన్బుమణి, అధ్యక్షుడు మురుగేశ్, ఏరియా కార్యదర్శుల గుణశేఖరన్, మణి, ఈశ్వరన్, ఏరియా అధ్యక్షుడు రాజశేఖర్, విధాన సెక్రటరీ చంద్రన్‌తో సహ పాల్గొన్నారు.

బన్నేరుఘట్ట జూలో ఏనుగు పిల్ల

హోసూరు (మత్తిగిరి) డిసెంబరు 31: సరిహద్దులోని బన్నేరుఘట్ట జూలో రూపా అనే 15 ఏళ్ల ఏనుగు మూడో పిల్లను ఈనింది. బుల్లి ఏనుగు పిల్లను చూసి సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూప గతంలో రెండు పిల్లలను ఈనింది. ఇందలో ఒకటి మగ, మరొకటి ఆడ ఉన్నాయి. తాజాగా ఒక ఆడ ఏనుగును ఈనడంతో క్రమేపీ ఏనుగుల సంఖ్య పెరగనుందని అటవీశాఖ అధికారులు అభిప్రాయపడ్డారు. పశువైద్యుడి సంరక్షణలో ఏనుగులు ఆరోగ్యంగా ఉన్నాయన్నారు. కాగా తల్లి ఏనుగుతో కలసి ఉన్న బుల్లి ఏనుగును చూసేందుకు హోసూరు ప్రాంతం నుంచి కూడా వెళ్తున్నారు. బన్నేరుఘట్ట జూలో 25 ఏనుగులు ఉండగా పార్కుకు వచ్చేవారి సంఖ్య క్రమేపీ పెరుగుతోందని అధికారులు తెలిపారు.



తల్లి ఏనుగుతో బుల్లి ఏనుగు

నీటి ఎద్దడి నివారణకు చర్యలు: మేయర్

హోసూరు (సిప్‌కాట్) డిసెంబరు 31: హోసూరు కార్పొరేషన్‌లో రానున్న వేసవి ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మేయర్ సత్య అధ్యక్షత వహించగా డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కార్పొరేషన్ కమీషనర్ స్నేహ ముఖ్యులుగా పాల్గొన్నారు. నగరంలోని ప్రధానంగా 2, 8, 9, 10, 13, 17, 18, 27, 35, 42, 45, 5, 6, 7, 12, 23, 31, 32 నీటి ఏరియాలలో పైపులు కూడా వేయాలని నిర్ణయించారు. అలాగే ఇప్పటికే బోరు బావులు వేసి కరెంటు కనెక్షన్ పొందని వారు వెంటనే విద్యుత్ కనెక్షన్ పొందాలన్నారు. వినియోగంలో లేని విద్యుత్ లైన్లను గుర్తించి వాటిని డిస్‌కనెక్ట్ చేసి జాబితా నుంచి తొలగించాలని ఈ మేరకు విద్యుత్ బోర్డుకు లేఖ కూడా పంపాలని నిర్ణయించారు.



ప్రసంగిస్తున్న మేయర్ సత్య

అక్రమ తాగునీటి కనెక్షన్లను గుర్తించి వెంటనే వాటిని తొలగించడం లేదా జరిమానా విధించి క్రమబద్ధీకరించాలని సూచించారు. సమావేశంలో కార్పొరేషన్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జూనియర్ ఇంజనీర్లు, తాగు నీటి సరఫరా విభాగం అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

డాక్టర్ రంగనాథ్‌కు అరుదైన గౌరవం

హోసూరు, డిసెంబరు 31: నగరంలోని అదియమాన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రంగనాథ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) జాతీయ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. జబల్‌పూర్‌లోని రాయల్ ఆర్బిట్ హోటల్‌లో జరిగిన 38వ ఇండియన్ ఇంజినీరింగ్ కాన్ఫరెన్స్‌లో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ రంగనాథ్ బాధ్యతలు చేపట్టారు. సదస్సులో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ సహా పలువురు అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు. ఇంజినీరింగ్ శ్రేష్టతను సాధించడంలో అవిష్కరణ, పరిశోధన సహకారం ప్రాముఖ్యత గురించి రంగనాథ్ మాట్లాడారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ సభ్యులు తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి ఒక కోర్సును రూపొందించేటప్పుడు సంస్థ వారసత్వాన్ని నిలబెట్టడానికి తన నిబద్ధతను వివరించారు. జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో కళాశాల పాలకవర్గం, ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులు ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.



జ్ఞాపిక అందుకుంటున్న రంగనాథ్

ఆ ఐదుగురికి దహన సంస్కారాలు

బళ్ళారి గాంధీనగర్, డిసెంబరు 31: ఈనెల 29వ తేదీన గురువారం చిత్రదుర్గ నగరంలోని చెళ్ళకెర గేటువద్ద పాడుబడిన ఇంటిలో లభ్యమైన ఐదు అస్తిపంజరాలకు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. గురువారం రాత్రి అస్తిపంజరాలను ఉన్న విషయం వెలుగు చూసినప్పటి నుండి శుక్రవారం వాటిని బసవేశ్వర వైద్యకీయ, పరిశోధనా కేంద్రానికి తరలించి శవ పరీక్షలు నిర్వహించారు. శనివారం వాటికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం సిద్దవ్వనహళ్ళిలో ఉన్న మృతుడు జగన్నాథ్ కుటుంబానికి చెందిన సంబంధికులకు వాటిని అప్పగించారు. సాంప్రదాయంగానే అస్తిపంజరాలకు ఎలక్ట్రికల్ విధానంతో శవసంస్కారాలు నిర్వహించాలని సంబంధికులు ముందుగా నిర్ణయించినా, దావణగెరకు చెందిన ఫోరెన్సిక్ ల్యాబరేటరీ నుండి నివేదికలు వచ్చేంతవరకు విద్యుత్ ద్వారా శవసంస్కారాలు నిర్వహించడానికి అవకాశం లేదని పోలీసులు తెలపడంతో చిత్రదుర్గ నగరంలోని జోగిమట్టి రోడ్డులో ఉన్న వివేకానంద నగర్ సమీపంలో హిందూ రుద్రభూమిలో మృతుల సంబంధికులు శవసంస్కారాలు నిర్వహించారు. ఘటనకు సంబంధించి మరణోత్తర పరీక్షలు నిర్వహించిన వైద్యుల బృందం మృతులు ధరించిన దుస్తులు, అస్తిపంజరాల రూపాల ద్వారా శవాల్లో ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులుగా గుర్తించినట్లు, వాటి ఆధారంగా ప్రతి అస్తి పంజరానికి నిర్దిష్టమైన గుర్తింపు నెంబరు ఇచ్చిన అస్తిపంజరాలను డాక్టర్లు సంబంధికులకు అందజేశారు. శనివారం పోలీసుల సమక్షంలోనే అస్తి పంజరాలకు అంత్యక్రియలు నిర్వహించారు. అస్తిపంజరాలు లభించిన ఇంటిని ప్రస్తుతం ప్రస్తుతం జిల్లా పోలీసు విభాగం స్వాధీనం చేసుకుని మృతికి దారితీసిన ఘటనలు వెలికితీసేందుకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ధర్మేంద్రకుమార్ మీనా తెలిపారు.

కలుషితమవుతున్న తుంగభద్ర జలాలు

బళ్లారి సిటీ, డిసెంబరు 31: తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ లేకపోవడంతో నదిలో నీటి ప్రవాహం తగ్గుతోంది. అయితే పలు రకాలుగా జలాలను కలుసితం చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఈసంవత్సరం వర్షాలు సరిగా కురువక పోవడంతో పంటలు కూడా అరకొరగా పండాయి. ఆయకట్టు రైతులు నష్టాల్లో కూరుకుపోయారు. ఈసంవత్సరం ఒకపంటకు మాత్రమే నీరు అందాయి. తాగునీరు అందించడమే కష్టంగా ఉన్న సమయంలో నదీ జలాలను కలుషితం చేసే కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, తుంగభద్ర పవిత్రతను, పరిశుభ్రతను కాపాడుకోవాల్సి బాధ్యత ఎవరిది అనే ప్రశ్న తలెత్తుతోంది. పండుగల సమయంలో వాహానాలను శుభ్రం చేయడం, తదితర పనుల కారణంగా నీరు కలుషితం అవుతోంది. దీనికి తగిన రక్షణ కల్పించాలి. అంతేకాకుండా నీటి వినియోగంలో పౌ రులు అవగాహన కలిగి ఉండాలి. నదిలో వాహనాలను శుభ్రం చేయడాన్ని నిరోధించాలని ఆయకట్టు ప్రజలు కోరుతున్నారు.



నదిలో దుస్తులు, వాహనాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

కేఎల్ఎన్ ప్రసాద్ (జయంతి)



ప్రముఖ పారిశ్రామికవేత్త కానూరి లక్ష్మీనారాయణ ప్రసాద్ 1928 జనవరి 1న కృష్ణాజిల్లా కొత్తవరం గ్రామంలో జన్మించారు. కేఎల్ఎన్ ప్రసాద్‌గా చిర పరిచితులు. సంపాదకుడు, హేతువాది అయిన నార్ల వెంకటేశ్వ రావు, ఇతర మిత్రులతో కలసి 1960 జూలై 1న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికను విజయవాడలో స్థాపించారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం సేవలందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1987 జూలై 16న కన్నుమూశారు.

రమేష్ నాయుడు (జయంతి)



ప్రముఖ సంగీతదర్శకులలో ఒకరైన పసుపులేటి రమేష్ నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా కొండపల్లిలో 1933 జనవరి 1న జన్మించారు. సంగీతంపై చిన్నప్పటి అపారమైన ఆసక్తిని పెంచుకున్న ఆయన బీఆర్ చోప్రా మార్గదర్శకత్వంలో సంగీత పరికరాలపై అవగాహన పెంచుకుని వాటిని వినియోగించడంలో శిక్షణ పొందారు. అనంతరం హెచ్ఎంవి మ్యూజిక్ కంపెనీ ఆర్కెస్ట్రాలో చేరారు. తెలుగు సినిమా రంగంలో తనదైన ముద్రవేసుకున్నారు. బెంగాలీ, నేపాలీ, ఒరియా సినిమాలకు కూడా పదేళ్ళపాటు సేవలందించారు. 1983లో 'మేఘసందేశం'కు ఉత్తమ సంగీత దర్శకుడిగా జాతీయ పురస్కారం అందుకున్నారు. 1987 సెప్టెంబరు 3న ఆయన కన్నుమూశారు.

సోనాలి బెంద్రే (పుట్టినరోజు)



సోనాలి బెంద్రే 1975 జనవరి 1న ముంబైలో జన్మించారు. ఒక మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన ఆమె హిందీ సినీ రంగంతో మరాఠీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల సిని మాల్లో నటించారు. 19 ఏళ్ళ ప్రాయంలోనే ఆమె తన తొలి చిత్రానికి గాను ఫిలిం ఫేర్ పురస్కారాన్ని అందుకున్నారు. లెక్కకు మిక్కిలి అవార్డులు పొందారు. పలు కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా సేవలందించారు. 2017 నుంచి ఆమె సోనాలి బుక్ క్లబ్‌ను నిర్వహిస్తున్నారు. 2019లో జాతీయ స్థాయిలో ఉమెన్ అఛీవర్ పురస్కారం పొందారు.

విద్యాబాలన్ (పుట్టినరోజు)



విద్యాబాలన్ 1979 జనవరి 1న బాంబేలో జన్మించారు. హిందీ సినిమా రంగంలో విలక్షణ పాత్రలను పోషించి తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. తన అద్భుత నటనా కౌశల్యానికి గాను ఒకసారి నేషనల్ ఫిలిం అవార్డు, ఆరుసార్లు ఫిలింఫేర్ పురస్కారాలను అందుకున్నారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌లో సభ్యురాలు. యూటీఓ మోషన్ పిక్చర్స్ సీఈఓ సిద్ధార్థరాయ్ కపూర్‌ను వివాహమాడారు. సమాజసేవలతో ఖ్యాతి గడించారు. మహిళల సాధికారతకోసం ఎనలేని కృషి చేశారు. 2014లో 'పద్మశ్రీ' అందుకున్నారు.

229 మందికి పాజిటివ్

- వెయ్యికి చేరిన కొవిడ్ యాక్టివ్ కేసులు

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొవిడ్ కేసులు అధికమవుతున్నాయి. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 229 మందికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. 62 మంది డిశ్చార్జ్ అయ్యారు. యాక్టివ్ కేసులు వెయ్యికి చేరాయి. బెంగళూరులో 64, మైసూరులో 26, మండ్య 22 మంది కాగా మిగిలిన జిల్లాల్లో 15లోపు కేసులు నమోదయ్యాయి. ఇటీవల పాజిటివ్ రేటు 2 శాతం ఉండేది. తాజాగా 6.49 శాతానికి పెరిగింది. కొవిడ్ కేసులు పెరుగుతున్న తరుణంలో జనవరి 2 నుంచి వ్యాక్సినేషన్ ప్రారంభానికి రాష్ట్రవైద్య శాఖ కసరత్తు చేస్తోంది. ఉచితంగా కోర్బి వ్యాక్సిన్ ఇవ్వాలని తీర్మానించారు. రాష్ట్రంలో గతంలో 1, 2వ డోసులు దాదాపు వంద శాతం పూర్తయ్యాయి. మూడో డోసు కేవలం 27శాతం మాత్రమే నమోదైంది. రాష్ట్రంలో 1.5 కోట్ల మంది మూడో డోసును తీసుకోలేదు. ప్రాథమిక దశలో 30 వేల మందికి కోర్బి వ్యాక్సిన్‌ను కొనుగోలు చేసి వేయనున్నారు.

కలపచోరీ కేసులో బీజేపీ ఎంపీ సోదరుడి అరెస్టు

- ఇదంతా కుట్ర... ప్రతాప్‌సింహ



విక్రమ్‌సింహ

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అడవిలో కలపచోరీ కేసులో మైసూరు బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహ సోదరుడు విక్రమ్‌సింహను అటవీ అధికారులు అరెస్టు చేశారు. హాసన్ జిల్లా బేలూరు నందగొండనహళ్ళి అటవీప్రాంతంలో 126 చెట్లను నరికివేసిన కేసులో బెంగళూరు పోలీసుల సహకారంతో అటవీఅధికారులు శనివారం అరెస్టు చేశారు. పది ఎకరాల విస్తీర్ణంలోని 126 చెట్లను తొలగించినట్టు విక్రమ్‌సింహపై కేసు నమోదైంది. అటవీ అధికారులు గాలింపులు జరిపినా ఆచూకీ లభించలేదు. ఈమేరకు బెంగళూరు పోలీసుల సహకారంతో విక్రమ్‌సింహను అరెస్టు చేశారు. కాగా ఆదివారం మైసూరులో ఎంపీ ప్రతాప్‌సింహ మీడియాతో మాట్లాడుతూ ఎఫ్ఐఆర్‌లో నా తమ్ముడి పేరు లేదని, అయినా అరెస్టు చేశారన్నారు. నన్ను ముగించేందుకు సీఎం సిద్ధరామయ్య కుట్ర పన్నారని మండిపడ్డారు. నా చెల్లిని, తల్లిని కూడా అరెస్టు చేయండంటూ సవాల్ విసిరారు. సిద్ధరామయ్యకు సాష్టాంగ నమస్కారం అంటూ మండిపడ్డారు. కుమారుడి రాజకీయ భవిష్యత్తుకోసం ఎవరినైనా తొక్కేందుకు సిద్ధమని సిద్ధరామయ్య నిరూపిస్తున్నా రన్నారు. ఇటువంటి తండ్రి అందరికీ ఉండరన్నారు. నన్ను వచ్చే ఎన్నికల్లో ఎదుర్కొలేకమనే ఇలా మానసికంగా హింసిస్తున్నారన్నారు. కాగా విక్రమసింహ తరపున న్యాయవాదులు చంద్రేగౌడ, ధర్మేగౌడలు జామీను పిటీషన్ వేశారు. పరిశీలించిన బేలూరు సీనియర్ సివిల్ జడ్జ్ బెయిల్ మంజూరు చేశారు. మొత్తమ్మీద ఎంపీ సోదరుడి వ్యవహారం చర్చనీయాంశమైంది.

వయసులో చిన్న.. పోరాటంలో డీకే మిన్న

- డీకే శివకుమార్‌కు సీఎం సిద్ధరామయ్య ప్రశంస

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వయసులో నాకంటే చిన్నవాడైనా రాజకీయాల్లోనూ నేనే ముందుగా వచ్చినా పోరాటాలు, క్రియాశీలమైన విభాగంలో నాకంటే డీకే శివకుమార్ ముందంజలో ఉన్నారని సీఎం సిద్ధరామయ్య కొనియాడారు. ప్రెస్‌క్లబ్ ఆఫ్ బెంగళూరు 2023 మ్యాన్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని డీకే శివకుమార్‌కు సీఎం ప్రదానం చేశారు. ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ గతంలోనూ ఏడాది చివరి వేడుకలకు ప్రెస్‌క్లబ్‌కు వచ్చానని గుర్తు చేశారు. కొత్త సంవత్సరం అందరికీ శుభం జరగాలని ఆకాంక్షించారు. మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాజంలో సమస్యలను వెలికితీసి పరిష్కార వేదికగా పనిచేయాలని సూచించారు. మాజీ న్యాయమూర్తి శివరాజ్ పాటిల్‌కు ప్రత్యేక పురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కార గ్రహీత డీకే శివకుమార్ మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ ప్రతిష్టాత్మకమైనదని నన్ను ఏడాది ప్రత్యేక వ్యక్తిగా గుర్తించడాన్ని సంతోషిస్తున్నానన్నారు. రాష్ట్ర రాజకీయాలపై నా అనుభవం పనిచేసిందన్నారు. తీహార్ జైలులో ఉన్నప్పుడు కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియాగాంధీ పరామర్శించారన్నారు. అప్పుడే చెప్పానని రాష్ట్రంలో ఎవరి మద్దతులేకుండా సొంతంగా అధికారంలోకి వస్తామని స్పష్టం చేశానన్నారు. అదే జరిగిందన్నారు. విద్యార్థినాయకుడిగా రైల్‌రోకో చేశానని, ఆ ఫోటోతో నాకు సత్కారం చేశారన్నారు. బతుకు ఎలాగో మారుతుంటుందని, కానీ మీడియాను వదిలి ఉండలేమన్నారు. సంసారం చేసినట్టేనని మీతో సహవాసం కొనసాగించాల్సిందేనన్నారు. నాకు 'బండె' అని బిరుదు ఇచ్చారని ఇప్పటికే సమాధానం చెప్పానన్నారు. దానికి తోడు ట్రబుల్‌షూటర్ అనే మరో బిరుదు కూడా ఇచ్చారన్నారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు మీరేనన్నారు. అయితే వాస్తవాలు రాయాలని, ఈరోజు మాలవేసి సత్కరించారని, ఇదే నాకు బాధ్యతాయుతమైనదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు రాత్రింబవళ్లు పని చేశానన్నారు. నా హిస్టరీ గురించి చర్చ అవసరం లేదని, నా నమ్మకం విశ్వాసం, ఓ గురువును నమ్ముకున్నానన్నారు. న్యాయాన్ని నమ్మానని, ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్తానన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎమ్మెల్యే శ్యామనూరు శివశంకరప్ప, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మల్లప్పతోపాటు ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్ ది ఇయర్ పురస్కారంతో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సన్మానం, చిత్రంలో సీఎం, మాజీ జస్టిస్ తదితరులు

సాహిత్యం సమాజానికి సందేశం ఇవ్వాలి



తేజశ్రీకి కావ్యానంద పురస్కారం

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం సమాజానికి సందేశం ఇచ్చేలా ఉండాలని కన్నడ సంస్కృతిశాఖ డైరెక్టర్ ధరణీదేవి మాలగత్తి అభిప్రాయపడ్డారు. ఆదివారం కన్నడ సాహిత్య పరిషత్‌లో కన్నడ సాహిత్య సంవర్ధక ట్రస్టు ఆధ్వర్యంలో ఈ ఏడాది పురస్కారం కావ్యానంద పురస్కారాన్ని తేజశ్రీకి అందించారు. ఈ సందర్భంగా ధరణీదేవి మాట్లాడుతూ సమాజంలో విప్లవాత్మకమైన మార్పులకు సాహిత్యమే మూలకారణమన్నారు. అస్పృశ్యత, అసమానత్వం, ఆధ్యాత్మికం వంటి ఎన్నో అంశాలు పుస్తకాల రూపంలో రావడం ద్వారానే విజ్ఞానం సాధ్యమైందన్నారు. ప్రముఖ సాహితీవేత్త సిద్దయ్య పురాణిక్ తమ రచనలో నీవు ఏమైనా కావచ్చు కానీ ముందు మానవత్వంతో ఉండాలని పిలుపునిచ్చారన్నారు. ఆధునిక వచనాలు, సామాజిక చింతన, వ్యక్తిగత స్వాతంత్ర్యం గురించి ప్రస్తావించారు. యక్షిణి కన్నడికి సంబంధించి రేణుకాచార్య మహిళా కళాశాల ప్రిన్సిపాల్, కవి డాక్టర్ ప్రేమా సిద్ధరాజు మాట్లాడుతూ తేజశ్రీ తన రచనలో భావనాత్మక, లోతైన సాహిత్యం ఉండేదన్నారు. విమర్శకులు, ట్రస్టు సభ్యులు డాక్టర్ బసవరాజ్ సీ కల్గుడి, మేనేజింగ్ ట్రస్టీ ప్రసన్నకుమార్ పురాణిక్‌తోపాటు కన్నడ సాహిత్య సంవర్ధక ట్రస్టు అధ్యక్షురాలు విజయా నందీశ్వర్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు. ట్రస్టు కార్యదర్శి డాక్టర్ రుద్రేశ్ అదరంగి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

కృత్రిమ పూలు వాడొద్దు

- లాల్‌బాగ్‌లో వినూత్న చైతన్యం
- రెండు లక్షల గులాబీల పంపిణీ



లాల్‌బాగ్‌లో వినూత్నంగా చైతన్యంలో అధికారులు, తదితరులు

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ ప్లాస్టిక్‌పూలను వాడరాదని తద్వారా కాలుష్యం పెరుగుతుందని, రైతులు పండించే సహజసిద్ధమైన పుష్పాలను ఉపయోగించాలని రాష్ట్రప్రభుత్వ అదనపు ముఖ్యకార్యదర్శి శాలిని రజనీశ్ పిలుపునిచ్చారు. ఉద్యానవనశాఖ, అంతర్జాతీయ ఫ్లవర్ ఆక్షన్ కమిటీ, బెంగళూరు జీఎఫ్‌సీఏ అగ్రిప్లాస్ట్, పూల రైతులు, వ్యాపారులు సంయుక్తంగా లాల్‌బాగ్‌లో ఆదివారం సహజసిద్ధమైన పూలను వాడాలని వినూత్నంగా చైతన్య కార్యక్రమం జరిపారు. లాల్‌బాగ్‌కు అన్ని గేట్ల వద్ద వాకర్స్‌కు గులాబీలు పంపిణీ చేశారు. సుమారు 2లక్షలకుపైగా గులాబీలు పంపిణీ చేసిన అనంతరం శాలిని రజనీశ్ మాట్లాడుతూ సింథటిక్, ప్లాస్టిక్ పూలతో పర్యావరణంపై పెను ప్రభావం చూపనుందన్నారు. దక్షిణభారత పూలరైతుల సంఘం అధ్యక్షుడు అరవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 38వేల హెక్టార్లలో పూలసాగు చేస్తారన్నారు. గులాబీ, చామంతి, ముద్దబంతి, సుగంధరాజ్, కనకాంబరంతోపాటు విదేశీరకాల పూలను పండిస్తారన్నారు. 11లక్షలమంది పూలసాగు ద్వారా జీవనం సాగిస్తున్నారన్నారు. 2.8 లక్షల హెక్టార్లలో మల్లె, కాగడాలు, సాగు అవుతాయన్నారు. రాష్ట్రంలో 50 రకాల పూలు సాగు అవుతాయని, వీటిని ప్రజలు వినియోగించకపోతే సాగు చేసే రైతులు నష్టపోతారన్నారు. ఇకపై అన్ని కార్యక్రమాలకు సహజసిద్ధమైన పూలను వాడాలని పిలుపునిచ్చారు. సెల్ఫీ పాయింట్ ప్రత్యేక ఆకర్షణ అయ్యింది. ఉద్యానవనశాఖ కార్యదర్శి డాక్టర్ శ్యామలా ఇక్బాల్, దక్షిణభారత పూలరైతుల సంఘం డైరెక్టర్ శ్రీకాంత్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన వస్తు ప్రదర్శన



ప్రదర్శనను వీక్షిస్తున్న బీఈఓ తనుజా

బాగేపల్లి, డిసెంబరు 31: చిన్నారుల్లో సృజనాత్మకత, క్రియాశీలతను పెంచేలా విజ్ఞాన వస్తు ప్రదర్శన (సైన్స్ ఎగ్జిబిషన్) ఎంతగానో దోహదపడుతుందని బీఈఓ తనుజా అభిప్రాయపడ్డారు. పట్టణంలోని యంగ్ ఇండియా పాఠశాలలో ఏర్పాటైన విజ్ఞాన వస్తు ప్రదర్శన స్థానికులను ఆకట్టుకుంది. చంద్రయాన్-3, స్మార్ట్‌సిటీ, గ్లాస్‌హౌస్, ఆసుపత్రి, రైలు, ఎయిర్‌పోర్ట్, సోలార్ సిస్టమ్, సౌర వ్యవస్థ, రాకెట్, ఫ్లోటింగ్ హౌస్ వంటి 60కుపైగా నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనను విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వీక్షించి పిల్లలను అభినందించారు. ఈ సందర్భంగా బీఈఓ తనుజా మాట్లాడుతూ పిల్లల్లో దాగియున్న ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. కార్య క్రమంలో ప్రొఫెసర్ డీ శివణ్ణ, హేమంత రాజు, ప్రధానోపాధ్యా యురాలు శ్రీలక్ష్మి, కల్పనా తదితరులు పాల్గొన్నారు.

నిర్మలానందనాథస్వామిజీ ఆశీస్సులు పొందిన రక్షా రామయ్య



స్వామిజీ ఆశీస్సులు పొందుతున్న రక్షా రామయ్య

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): యువ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏఐసీసీ సభ్యుడైన ఎంఎస్ రక్షా రామయ్య చిక్కబళ్లాపురలో ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామిజీని భేటీ అయి ఆయన ఆశీస్సులు పొందారు. ఆదిచుంచనగిరి మఠంలో ఏర్పాటైన వేరుశనగ పరుషలో రక్షా రామ్య పాల్గొని స్థానికుల సమస్యలు ఆలకించారు. అనంతరం రక్షా రామయ్య మాట్లాడుతూ ఆదిచుంచనగిరి మఠంతో తమ కుటుంబానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. డాక్టర్ నిర్మలానందనాథ స్వామిజీకి ఆధ్యాత్మిక అంశాలతోపాటు నేటి సమాచార సాంకేతిక రంగంపైనా అవగాహన ఉందన్నారు.

సాధువుల ఉపదేశాలతో ఆత్మజ్ఞానం



కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరామ్

చింతామణి రూరల్, డిసెంబరు 31: వేల సంవత్సరల క్రితం నాటి సాధువులు, మహా పురుషులను నేటికీ స్మరిస్తున్నామంటే వారు స్వార్థకోసం బతుకలేదని వారి ఉపదేశాలు ఆత్మజ్ఞానంగా ప్రకాశిస్తున్నాయని కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరామ్ అభిప్రాయపడ్డారు. చింతామణి పట్టణం ఎన్ఆర్ లేఅవుట్‌లోని బ్రహ్మచైతన్య శ్రీరామ మందిరంలో సాగుతున్న బ్రహ్మచైతన్య మహరాజ్ ఆరాధనా మహోత్సవంలో ఆదివారం పాల్గొని ఆత్మబోధామృత ప్రవచనం చేశారు. ప్రాపంచిక మాయను కల్గినవారు ఆధ్యాత్మిక సాధన చేయడం సాధ్యం కాదన్నారు. ఈ మాయవల్ల మనస్సును వేరు చేసి గురోపదేశం పొందాల్సి ఉంటుందన్నారు. గురువుల మార్గంలో మనస్సును కేంద్రీకరించాల్సి ఉంటుందన్నారు. తత్వజ్ఞాని అయిన గురువును ఆశ్రయించాలన్నారు. ఆశల త్యాగంతోనే మనస్సు నిర్మల మవుతుందన్నారు. భక్తి సిద్ధించాలంటే మనస్సు శుద్ధిగా ఉండాలన్నారు. తొలుత మనస్సును జయించాల్సి ఉందన్నారు. మానవుడిగా పుట్టినవాడికి చింతలు సహజమన్నారు. ప్రపంచంలో ఉన్న మానవులకు ఎన్నెన్నో చింతలు ఉంటాయని, భగవంతుడి భజనతో ఇతర చింతలు మాయమవుతాయన్నారు. చింతలను వీడి గురువు స్మరణ చేయడం ద్వారా పరమపదవి లభిస్తుందని తాతయ్య చెప్పారని, ఈ భవసాగరాన్ని దాటాలంటే పరమాత్మ నామస్మరణయే ఆధారమన్నారు. మనస్సు నియంత్రణ లేకుంటే బతుకులో సుఖం సాధ్యం కాదన్నారన్న కైవార యోగినారేయణ తాతయ్య బోధనలు మనకు మార్గదర్శకమన్నారు. కాలజ్ఞాని అయిన కైవార తాతయ్య బోధనలు అనుసరణీయమన్నారు. భక్తితత్వాన్ని అల వరచుకోవాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కైవార తాతయ్య కీర్తనలను యోగినారేయణ సంకీర్తనా ప్రాజెక్టుసంచాలకులు విద్వాన్ వానరాశి బాలకృష్ణ భాగవతర్ పాడారు. వీరికి పక్కవాద్యాలుగా ఫిడేలుపై విద్వాన్ శ్రీహరి, మృదం గంపై కేకే భాను ప్రకాశ్ సహకారం అందించారు. డాక్టర్ ఎంఆర్ జయరాం, విద్వాన్ వానరాశి బాలకృష్ణ భాగవతర్‌ను శ్రీరామమందిర అధ్యక్షుడు వెంకటేశ్ మూర్తి ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో మందిరం ఉపాధ్యక్షుడు జేహెచ్ రఘునాథ్, రాజారాం, అశ్వథ్ నారాయణ, వైజీ నాణి, గిరిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు క్రైస్తవ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరణలో పాస్టర్లు ఎంబీ మోసెస్, బాలసుందరం

బెంగళూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామచంద్రపురలో ఉన్న తెలుగు బ్యాప్టిస్ట్ చర్చ్‌లో ఆదివారం జరిగిన ఆరాధాన మహోత్సవంలో 2024 తెలుగు క్రైస్తవ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తెలుగుతోపాటు కన్నడ, తమిళభాషలలో క్యాలెండర్‌ను విడుదల చేసినట్టు పాస్టర్ రెవరెండ్ ఎంబీ మోసెస్ తెలిపారు. దేవుడి వాక్యాలతో కూడి ఉంటాయన్నారు. బైబిల్ అంశాలను, ప్రాధాన్యతను వివరించారు. ప్రత్యేక ఏసుక్రీస్తు గేయాలను భక్త బృందం ఆల పించారు. కార్యక్రమంలో పాస్టర్ బాలసుందరం సహా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్ట చతుర్థి పూజలు



స్వామివారికి విశేష పూజలు

శిడ్లఘట్ట, డిసెంబరు 31: సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని పట్టణంలోని అశోకరోడ్డులో కొలువైన ద్విముఖ గణపతి ఆలయంలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు విశేషపూజలు కొనసాగాయి. వేకువజామున 4 గంటలకు ఆలయశుద్ధి, స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా పంచామృతాభిషేకం అనంతరం పుష్పాలంకరణ చేశారు. అనంతరం పండితులు సంకష్ట చతుర్థి ప్రత్యేక కథను భక్తులకు వివరించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక రాజకీయ ప్రముఖులు, వివిధశాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు, మహిళలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కాగా ప్రతి నెలా సంకష్ట చతుర్థిన క్రమం తప్పకుండా విశేష పూజలు నిర్వ హిస్తున్నారు. రానురాను భక్తుల సందడి పెరుగుతోంది. అందుకు తగ్గట్టుగానే విశేషపూజా కార్యక్రమాలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ నిర్వాహక సభ్యులు తెలిపారు.

ఆలయ జీర్ణోద్ధరణకు రూ.1.50లక్షలు విరాళం



విరాళం అందజేస్తున్న ప్రముఖులు

శిడ్లఘట్ట, డిసెంబరు 31: తాలూకాలోని కాచనాయకనహళ్ళి గ్రామంలోని శ్రీరామ దేవాలయ జీర్ణోద్ధరణకు ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ బీసీ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.1.50లక్షల విరాళాన్ని ప్రకటించారు. సంస్థ తాలూకా యోజనాధికారి సురేశ్‌గౌడ ఆలయ ట్రస్టు పదాధికారులకు డీడీని అందజేశారు. ఈ సందర్భంగా సురేశ్‌గౌడ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు, దేవాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలకు ఎంతో గ్రాంటు ఇస్తున్నారన్నారు. మహిళా స్వావలంబన కార్యక్రమాలు, చెరువులలో పూడిక తీత, టెక్నికల్, ఒకేషనల్ విద్యార్థులకు సుజ్ఞాననిధి శిష్యవేతన కార్యక్రమం ద్వారా చేయూత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్టు అధ్యక్షుడు రామకృష్ణప్ప, కార్యదర్శి నరసింహప్ప, ట్రస్టు సభ్యులు, ప్రాంతీయ అధికారి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.